# 'సంఘటిత నేరాల నియంత్రణ' చట్టాన్ని సంఘటితంగానే ఎదుర్కొందాం!

## బహిరంగ సభ

**11 ఏప్రిల్ 2001 సుందరయ్య విజ్ఞానకేంద్రం (మినీహాల్)లో**
**సాయంత్రం 6.00 గంటలకు**

## వక్తలు

**అధ్యక్షత: కె. బాలగోపాల్**



కె. జి. కన్నబిరాన్ (పియుసిఎల్)
డా. కె. కేశవరావు (కాంగ్రెస్)
వి. నారాయణ రెడ్డి (ఓపిడిఆర్)
అజీజ్‌పాషా (సిపిఐ)
వి. శ్రీనివాసరావు (సిపిఎం)
గుమ్మడి నర్సయ్య (న్యూడెమొక్రసీ ఎమ్మెల్యే)
అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్ ఎమ్మెల్యే)

వేరే రాష్ట్రాల సంగతేమోగానీ మనకు సంబంధించినంత వరకూ 'టాడా' తిరిగి వచ్చేసింది. 'సంఘటిత నేరాల నియంత్రణ' అనే పేరుతో అది చాలా త్వరగా తిరిగి వచ్చేసింది.

నేరవిచారణ పద్ధతిలో న్యాయం లేకపోవడం 'టాడా' సారాంశం. నేరపరిశోధన జాగ్రత్తగా చేసి నేరాన్ని రుజువు చేసే ఓపికలేని పోలీసు యంత్రాంగం అడ్డదార్లు కోరుకుంటూ ఉంది. ముద్దాయిని కొట్టి ఒప్పిస్తే సరిపోయే న్యాయవ్యవస్థ వారికి కావాలి. బెయిలు, బహిరంగ నేరవిచారణ, ప్రతిసాక్షినీ క్రాస్‌ఎగ్జామినేషన్ చేసే హక్కు- ఇవన్నీ తీసేయాలి. అరెస్టు చేసిన ముద్దాయిని విచారణ తంతు ముగిసేంత వరకు చీకటి కొట్లో బంధించి, కొట్టి నేరం ఒప్పించి, ముఖానికి ముసుగు వేసుకున్న సాక్షిచేత ఆ ఒప్పుకోలుకు వత్తాసుగా పలికించి జైలు లోపలే- బంధుమిత్రులకు, పత్రికా విలేకరులకు ప్రవేశం నిరాకరించి- నేరవిచారణ ముగించి శిక్షవేసేసే 'న్యాయ' వ్యవస్థ పోలీసుల చిరకాల మనోభీష్టం.

టాడారూపంలో ఫలించిన ఈ కల చేయిజారిపోయిందని వారు అయిదేళ్లుగా పడుతున్న బాధ వర్ణనాతీతం. ఇప్పుడు వారికి ఉపశమనం కలిగిస్తూ చంద్రబాబు 'సంఘటిత నేరాల నియంత్రణ' చట్టాన్ని చేశాడు. నిజానికి 'టాడా'కు కొనసాగింపుగా 'పోటా' అనే బిల్లొకటి లా కమిషన్ ఆమోదం పొంది పార్లమెంటు ముందుకు పోవడానికి రెడీగా ఉంది. కానీ అస్థిరమైన కేంద్రప్రభుత్వం ఇప్పట్లో ఆ బిల్లుకు చట్టరూపం ఇచ్చేటట్టు కనబడడంలేదని చెప్పి రాష్ట్రాలు ఒక్కొక్కటిగా తమ టాడాలు తామే రూపొందించుకుంటున్నాయి. సంఘటితనేరాల నియంత్రణ పేరుతో మహారాష్ట్ర, కర్నాటకలు చట్టాలు చేశాయి. మనది వాటి నమూనాయే. టెర్రరిజాన్ని అదుపు చేసే పేరిట మధ్యప్రదేశ్ 'పోటా' వంటి చట్టాన్ని జారీ చేసింది. మొత్తానికి నేర విచారణ వ్యవస్థలో చీకటి రాజ్యం స్థిరపడినట్టే భావించవచ్చు.

'సంఘటిత నేరాలను' అదుపు చేయనక్కరలేదా అని అడుగుతారేమో. రాష్ట్రప్రభుత్వం ఉదహరిస్తున్న సంఘటిత నేరాలు ఏవి? వాటిలో పాలకుల అండలేకుండా జరిగే సంఘటిత నేరాలు ఏవైనా ఉన్నాయా? పోలీసుల లాలూచీ లేకుండా పని చేసే సంఘటిత నేరస్తుల బృందాలు ఏవైనా ఉన్నాయా?

అక్రమ మద్యం రవాణా ప్రభుత్వం పేర్కొన్న సంఘటిత నేరాలలో ఒకటి. అది ఇప్పటికే ఎక్సైజ్ చట్టం కింద నేరం. మారుమూల గూడేలలో గుడుంబా కాసేవాళ్లు ఈ నేరానికి అరెస్టవుతున్నారు, విచారణ ఎదుర్కొంటున్నారు. వాళ్ల కోసం కొత్త చట్టం అక్కరలేదు. చట్టానికి దొరకనిది ఘరానా ఎక్సైజ్ నేరస్తులు. వీరు చట్టానికి దొరకక పోవడానికి కారణం చట్టంలోని బలహీనత కాదు, పాలనాయంత్రాంగం అస్మదీయుల పట్ల చూపే ఆదరణ. ఘరానా మద్యం దొంగరవాణాదారులంతా రాజకీయప్రాబల్యం కలవారే. ముఖ్యమంత్రి తమ్ముడి పేరు ఈ సందర్భంలో తరచు వినపడుతుంటుంది. రాయలసీమ జిల్లల లోనయితే ఎంఎల్ఏలలో సగం మందికి పైగా ఈ చీకటి వ్యాపారంలో

నల్ల చట్టం వద్దు

పీకలదాకా కూరుకుపోయి ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వారిని రాజకీయాల నుండి దూరం ఉంచే రాజకీయ సంస్కారం ప్రధానపార్టీలలో దేనికీ లేదు. అది జరగనంత కాలం చట్టం వారిని అంటదు. పెద్దవాళ్లను ముట్టుకునే సాహసం మన పోలీసులు చేయరు. అటువంటప్పుడు చట్టాన్ని మారిస్తే ఏమొస్తుంది? చిన్నవాళ్లను మరింత సతాయించడం తప్ప ఏం ఒరుగుతుంది?

భూమి కబ్జాలు ప్రభుత్వం ఇస్తున్న మరొక ఉదాహరణ. ఇది మరీ విడ్డూరం. గుడుంబా వ్యవహారంలోనయినా చిన్న జనం- ప్రధానంగా షెడ్యూల్డు తెగలు- కనిపిస్తారుగానీ భూమి కబ్జాదారులంతా 'పెద్దమనుషులే'. అందువల్లనే ఆ నేరానికి ఇప్పటికే ఒకటికి రెండు చట్టాలు, ప్రత్యేకకోర్టులు ఉన్నప్పటికీ భూమి కబ్జాలు మాత్రం సాగుతూనే ఉన్నాయి. నిలువనీడలేక దొరికిన జాగాలో గుడిసెలేసుకున్న పేదలు తప్ప వేరే ఏ కబ్జాదారులూ చట్టానికీ కోర్టులకూ దొరకడం లేదు. ఆ తప్పు చట్టానిది కాదు, దానిని నిష్పక్షికంగా అమలు చేయలేని వంకరపాలనది. ఇప్పుడు చట్టాన్ని సవరిస్తే ఆ వంకర పోతుందా? చట్టాన్ని నిర్భీతిగా అమలు చేసే సంకల్పం వచ్చేస్తుందా? లేకపోతే గుడిసెవాసుల మెడల మీద మరొక కత్తిగా ఇది నిలబడుతుందా?

రాయలసీమ ఫాక్షన్ ముఠాలు, వాటి దౌర్జన్యాలు ఈ కొత్తచట్టానికి కారణంగా చెప్పుకుంటున్న సంఘటిత నేరాలలో మరొకటి. మరి భూమా నాగిరెడ్డికీ, బైరెడ్డి రాజశేఖరరెడ్డికీ, కె.ఇ.ప్రభాకర్‌కూ, పరిటాల రవీంద్రకూ టిక్కెట్లు ఇచ్చినప్పుడూ పదవులిచ్చినప్పుడూ ఈ సంగతి తెలియలేదా? ఫాక్షనిస్టుల దౌర్జన్యాలను ఆసరా చేసుకునే కదా రాయలసీమ తెలుగుదేశమైనా కాంగ్రెసయినా ఎన్నికలలో పోటీ చేస్తున్నది, గెలుస్తున్నది? ప్రజల మీద దుర్మార్గమైన చట్టాలు రుద్దడానికి వాటిని కారణంగా చూపించేబదులు, ముఠానాయకులను రాజకీయంగా చేరదీయబోమని ప్రధాన రాజకీయపార్టీలన్నీ ఒక నిర్ణయం తీసుకోవచ్చునుకదా? వారిపైన చర్య తీసుకోకుండా పోలీసులకు అడ్డం రామని ఒక నిర్ణయం తీసుకోవచ్చును కదా? అప్పుడు కూడా వారి ఆటకట్టడానికి సాధారణచట్టాలు సరిపోవని చంద్రబాబు అనగలడా?

రెండునాల్కల రాజకీయాల పర్యవసానమయిన పాలనా దౌర్బల్యానికి పుట్టిన విషసంతానం ఈ 'సంఘటిత నేరాల నియంత్రణ చట్టం'. రాజకీయప్రాబల్యం ఉన్న వాళ్లను మామూలు చట్టాలు ఏమీ చేయలేనట్టే ఈ చట్టమూ ఏమీ చేయబోదు. ఎందుకంటే అక్కడున్న సమస్య చట్టానికి సంబంధించింది కాదు.

మరి దీనికి ఎవరు బలికాబోతారంటే గుడిసెవాసులూ భూమి కోసం పోరాటం చేసే పేదలూ 'భూమి కబ్జాదారులు'గా రూపాంతరం చెంది బలికాబోతారు. చందాల మీద ఆధారపడక తప్పని అన్ని రకాల ఉద్యమకారులూ 'బలవంతపు డబ్బు వసూలు' చేసే నేరస్తులుగా ఈ చట్టం కింద బందీలు కాబోతారు. చారిత్రక కారణాల వల్ల బందిపోట్లుగా బతుకుతున్న కొన్ని పీడిత కులాల జనం 'సంఘటిత నేరబృందాలుగా' శాశ్వతంగా చీకటికొట్లలోకి పోబోతారు. మారుమూల తండాలలో బెల్లంతో సారాయి కాచి అమ్ముకొని బతికే గిరిజనులు 'దొంగమద్యం సిండికేట్లు'గా ఈ చట్టానికి నైవేద్యం కాబోతారు. సంఘటిత బలప్రయోగంతో తప్ప ఈ వ్యవస్థను మార్చలేమన్న రాజకీయ విశ్వాసం గల నక్సలైట్లు 'సంఘటిత నేరబృందం'గా ఈ చట్టం వేటుకు గురికాబోతారు. హిందుత్వవాదుల పాలన పట్ల వ్యతిరేకత పెంచుకుని మిలిటెంట్ ముస్లిం సంస్థలతో సంబంధాలు పెట్టుకున్న ముస్లిం యువకులు కూడా దీని కాటుకు గురి అవుతారు.

పై జాబితాలోని కొందరి కార్యకలాపాలు సమాజానికి సమస్యాత్మకమైనవే కావచ్చు. కానీ ఇవేవీ ఒళ్లు బలిసి చేసే నేరాలు కావు. వట్టి నేరాలుగా చూడదగినవి కావు. వట్టినేరాలుగా చూడదగ్గ బలిసిన నేరముఠాల నేరాలు ఈ చట్టానికి మాటవరసకు అందుతాయిగానీ వాస్తవంలో అందవు.

సామాజిక ఆర్థిక మూలాలు గల ఉద్యమాలనూ అల్లర్లనూ అలజడులనూ నేరాలనూ అన్యాయమైన చట్టాలను అడ్డం పెట్టుకొని క్రూరంగా అణచివేసే ఆలోచనను మనమంతా ఎందుకు ఆమోదించాలి? చంద్రబాబు అనుసరిస్తున్న గ్లోబలైజేషన్ విధానాలు మరింత ఎక్కువగా పీడిత ప్రజలనేకాక ఇంతకాలం మధ్యతరగతిగా భావిస్తున్న వారిని సహితం ఈ 'సంఘటిత నేరాల నియంత్రణ' చట్టానికి గురయ్యే స్థితికి నెడుతున్నాయి. ఆ సంగతి అతనికి తెలుసును కాబట్టే ఇటువంటి చట్టం చేశాడు. దానిని అనుమతించి మన హక్కులకు మనమే గోరీ కట్టుకుని మన భవిష్యతును ఆవరిస్తున్న చీకట్లను ఎదిరించే స్వేచ్ఛను కోల్పోదామా? లేక ఆ స్వేచ్ఛను కాపాడుకోవడానికి ఇటువంటి నిర్బంధ చట్టాలను సంఘటితంగా ఎదుర్కొందామా?

హైదరాబాద్

08.04.2001

-మానవహక్కులవేదిక